# కథ

# మరో 'మనో' గీతం

—కె.వి. నరేందర్

నువ్వెక్కడో దిగంతాల కవతల నిల్చుండి పిలుస్తావు.

నే నెలా రాను... చెప్పు...???

కాలుష్యం పెరిగిన బంధాల మధ్య బందీనైపోయినట్టు వుంది. మనో... గుండెల్లో ఏర్పడ్డ అల్పపీడనం తుపాన్‌లా నీ జ్ఞాపకాన్ని మోసుకొస్తుంది. కళ్ళల్లో జిల్లేడు పూలు పూస్తాయి.

దుర్గంధాన్ని పరిమళించే ఈ గదిలోకి అగరొత్తి పొగలా రావూ...? ఈ నాలుగేళ్ళనుంచి నీకోసం ఆ సాలెపురుగు...విరిగిన కుర్చీ...భావుకత్వాన్ని, శ్రీశ్రీని, చెలాన్ని కొరుక్కుతింటున్న చెద పురుగులు, గుండెలు బాదుకునే కిటికీ రెక్కలు...అన్నీ ఎదురుచూస్తాయి.

నీ జ్ఞాపకాలు గుబాళించే ఈ గదిని 'ఆమె' స్టోర్ రూం చేసింది.

ఆమె కేం తెలుసు...?

ఈ నాలుగ్గోడలూ నాలుగు శతాబ్దాలు సైతం జీర్ణించుకోలేని స్మరణికల శకలాల్ని పేర్చుకున్నాయని, ఆ గదిలోని గాలి మొత్తం నీ నిశ్వాసల నిట్టూర్పు లేనని...

మనో...

'ఆమె' పొత్తికడుపులో ఒక నెత్తుటి పువ్వు వికసిస్తే కత్తెర్లతో కత్తిరించుకుంది మరో రెండేళ్ళదాకా ఏ బాదర బందీ వద్దని... నాకేమనిపించిందో తెల్సా... అమృతాల శృతుల కోసం ఆకలి వాకిళ్ళ ముందు 'చితులు' పేర్చుకుంటున్న కన్నతల్లుల తరం ఇది.

కాని...

రెప్పల పుటల్ని సూదుల్తో కుట్టేసి... చూపుల్ని చిదిమేసిన శూన్యంలో పెరుగుతున్న శవమై నీ కడుపు మీద సమాధిలా పొదుచుకొస్తే కత్తుల్నీ, కత్తెర్లనీ నా క్రెప్పల అంచున సాన పట్టే సమయాన... ఊపిరి సలుపని ఈ గుహలో నీ పేగుల్తోనే ఉరి బిగించుకునే ముందు నన్ను చంపే హక్కు ఈ పవిత్ర దేశంలో నీకు లేదని తెల్సి కూడా ఎందుకీ దుర్మార్గానికి తలపడ్డావ్... అని పసికందు నిలదీసి నిళ్ళని ప్రశ్నిస్తే బావుండు.

మనో...

మాతృప్రేమ గురించి నువ్వనేదానివి.

'అది మట్టిలాంటిది. ఆ నాసనలోని ప్రకృతి తత్వాన్ని చాలామంది ఆడాళ్ళు ఆస్వాదించరు. శరీరాలు ముడేసుకోవడం వల్ల మనమంతా పుడుతున్నాం గాని పేగులు ముడేసుకుంటె మనం పుడుతున్నామా?

అని.

అందుకేనేమో... ఈ బంధాల మధ్య నిలువ నాసన.

ఆర్థిక సంబంధాలు చెడిపోయిన ప్రతిసారీ నీళ్ళంతా నన్ను వెలేసినట్టు ప్రవర్తిస్తే... గట్టు మీదికి చేరి నేను మౌనంగా మాట్లాడేది ఒక్కరితోనే... ఆ వాగుతో.

ఒద్దున కూచుంటే గదిలో నువ్ రాసిన కవిత గుర్తొచ్చేది.

'రసి పుండు మీద చీము

పేర్చిన బాల్యం మనది...

కుష్ఠుకురుపుల్లోంచి రక్తం కక్కిన యవ్వనం మనది...

అంపశయ్య మీది జీవితం...

ఆదమరచి నిద్రపోకు నేస్తం

కళ్ళ గోళాల్ని ఆకసాన దింపి దృక్కులు సారించు సమస్తం...''

నవ్వొచ్చేది... నన్ను నేను శాసించుకునే హక్కు కూడా నాకు లేని మనుషుల మధ్య మిగిలిపోయినపుడు ఇంకే దిక్కుల్లోకి చూడను...? చుక్కల్లో చిక్కుకు పోయిన నీ కోసం... నిలోచనాల కోసం నిరంతరం వాగు గట్టు మీద పచార్లు చేయడం తప్ప...!!

ఎవడో తెంపేసిన పాట వాగు తరగల్లో పడి. అపశృతితో కొట్టుకుపోతూంది చిందరవందరగా. కట్నం చావుల లిస్టు మీద గ్రాఫు గీత పెరిగినట్టు.

ఈ జీవితాలెందుకిలా ముసకబారిపోతున్నాయి. అనే ప్రశ్నను గుండె గోడకు తగిలించి పోతుంది వాగు. మనసు తగలబడి పోతుంది...

ఆలోచనలు కుప్పకూల్తాయ్... దుఃఖం నిస్తున్న నాసన...

మనో... నా పెళ్ళికి నువ్ రాలేదు కదూ... భలే చిత్రంగా జరిగింది. ఎండ పడుతున్నపుడు వాన కొడితే 'కాకి లగ్గం' జరుగుతోందని నువ్వనే దానివే. అలా...

ఆమె కూడా... లైసెన్సు లేని

ఫ్యాక్టరీలోంచి వూడిపడ్డ ఐ.ఎస్.ఐ. మార్కు ప్రోడక్టులా వుంటుంది.

ఆమె చెక్కిలి మీదెప్పుడూ సిగ్గు పూలను చూళ్ళేదు మనో... పెదాల నిండా రక్తం నోడే రంగులు, బంగారుఆభరణాలు, మహిళా సంఘాలు... మారుతీ కార్లు... ఆల్సేషియన్ కుక్కలు... ఆమె ప్రపంచం. ఆ అంచులు దిగి ప్రకృతితో ప్రతిస్పందించలేక ఆమె నేర్చుకున్న అందమైన పదం 'ఎలర్జీ'.

మనో...

ఈ గట్టు మీద గన్నేరు పూలని ఏరుకుంటూ వాగులో వేసేవాళ్ళం... ఏ జంటో ముచ్చటపడి సిగలో ముడుచుకుంటుందని... ఎవరి ఆశీస్సులూ దక్కలేదు కదూ??

నిక్కులో తేలిన మంచు ముక్కలా అనుక్షణం నీ జ్ఞాపకాల్లో గుండె కొట్టుమిట్టాడుతుంది. మత్తులాటి నీ గుర్తులు కదలడకపోతే 'హెరాయిన్' దొరకని వాడిలా గిలగిల్లాడిన క్షణాలెన్నో...

నీకు గుర్తుందా...?

పోస్ట్‌మాన్‌ని తప్ప నువ్వెవ్వర్నీ పలకరించేదానివి కాదు. అదేంటి అంటే

'ఆ భుజాలు రోజా పల్లకీలు మోస్తాయి... పాడెల్నీ మోస్తాయి. స్మశానపువాకిళ్ళకు దారి చూపే కేబుల్ గ్రాంలు... కొత్త ఆశలకు చివుళ్ళు తొడిగే టెలిగ్రాంలు ఆచేతుల్లోంచే జారిపడతాయి.

ఈ ప్రపంచం పట్టించుకోదుగాని నిరీక్షించే కళ్ళకు వాడొక టెన్పింగ్ నార్కే...

పరీక్షించే వాళ్ళకు వాడొక చెమట బట్టల ఖాకీ గాడు...' అంటూండేదానివి. నీ కోసం నిరీక్షిస్తున్న నాకు వాడెలా కన్పిస్తున్నాడో తెల్సా... ఎండిపోయిన నెత్తుటి మరకలా.

నువ్వు రాయనిదే వాడేం తెస్తాడు చెప్పు???

విధి సల్లేరు దండలతో సన్మానిస్తోంది. నీ దృష్టిలో నేనో ట్రిగ్గర్‌ని...

ఆమె దృష్టిలో నేనో బెగ్గర్‌ని...

మనో... ఎవరిదీ దృష్టిలోపం...?

ఆర్ద్ర పురుగులా ఎప్పుడో పెదాల మీద పాకి పోయే నవ్వు. కళ్ళు వర్షిస్తే చాలు. చారలు నకళ్ళుగా మిగిలిపోతాయి.

బాధను కొని తెచ్చుకుంటావని 'ఆమె' భావన. కొలిమంటుకున్న గుండెలో కుమిలిపోయే భగ్న గీతానికి ఏ భాష్యం చెప్పనా... ఓదార్పుల స్థానే సాధింపులు తెచ్చిపెట్టే 'మనీ'షి.

అందుకే ఒంటరిగా ఇలా వాగొడ్డుకి...

మనో...

వెళ్ళిపోయే ముందు నువ్వే పొడుపు కథ చెప్పావు. ఇదే వాగొడ్డున. గుర్తు తెచ్చుకో.

ఒక తల్లీ కొడుకు ఇదే వాగు ఒడ్డు మీంచి వెళ్తుంటే తల్లి వాగులో పడింది. కొడుకు రక్షించబోతే తల్లి షరతు పెట్టింది.

"మీ నాన్న నన్ను ముట్టుకోని చోట ముట్టకుండా నన్ను రక్షించాలి" అని. కొడుకు ఆలోచించి తల్లిని రక్షించాడు. "ఎలా చెప్పు?" అని.

ఈ వాగుని చూసినప్పుడల్లా ఆ ప్రశ్న గుర్తొస్తుంది. ఆనాడు జవాబు కోసం జాము రాత్రి దాకా కూర్చున్నా ఏమీ తోచలేదు.

ఇప్పుడు ఆ జవాబు వినడానికైనా వచ్చిపోవూ?

నిషోదయం మాటున గుండె గదుల్లో ఒంటరి తనాన్ని కప్పుకొని

గతం అనే...

చిరిగిన కాగితం మీద ఉషోదయపు కాంతులతో కాలచంద్రికలా నువ్ కాలుపెడితే 'కమ్ హియర్' అంటూ గుండె తలుపులు బార్లా తెరచి...

నీ కోసం నిరీక్షించే... అస్థికల్ని లెక్కించడానికైనా రావూ? అదుగో... ఎక్కడో 'మీనాక్షి పొన్నెదురై' సిలోన్‌లోంచి, దాశరథి కలంలో పురుడు పోసుకున్న జానకి గొంతు పూసిన కెరటం...

'వాడిన మోడు పూయక మానదు... వచ్చును వసంత కాలం...'

నవ్వొస్తోంది మనో... ప్రతి కదలికలో నిన్నూహించుకోవడం.

నిశ్శబ్దమై శాసించిపోయి... మెదళ్లో ఇంకా సముద్రమై ఘోషిస్తావెందుకూ? వాగు నురగల్ని చూసినప్పుడల్లా నీ నవ్వులూ గుర్తొస్తాయి. భళ్ళున విరిగిన కెరటం లాంటి నవ్వులు...

జగిత్యాల కాలేజీలో పెట్టిన పాటల పోటీల్లో అందరూ సీరియస్‌గా పాడితే నువ్వే పేరడీ పాడావ్. శరీరమ్మీద ఎక్కడ దురదలేసినా అది గుర్తొచ్చి నవ్వుకుంటాను.

"రాజశేఖరా...
నా... వీపు గోకురా
మధురమైన బాధరా
దురద తెలియలేదురా...'

సోజులు కొట్టే కెమిస్ట్రీ లెక్చరర్ గాడి మీద కసికొద్దీ పాడితే... పాపం ఆయన మొహం అప్పుడెలా అయింది?

కాలేజీ రావి చెట్టు కిందే నలిగిపోయిన నవ్వులన్నీ త్రవ్వి తెచ్చుకోవాలని వుంది మనో... ఆ జీవితం మరొక్కసారి రుచి చూడాలని వుంది. నీ అడుగులు పడ్డ ఆ గ్రౌండ్‌నంతా తడిమిచూడాలని వుంది.

'ఏదేమైనా కన్నీళ్ళు వొలకబోసుకునే కారుణ్యం

## త్వరలో
## కొమ్మనాపల్లి సీరియల్
# గాలితృష్ణ

ప్రేమది. కాఠిన్యం ప్రియురాలిది... నెరసి నల్లకాటికి మాత్రమే ఒక నేను... ఒక వాడు... మరొకడు... 'ఇంకొకడు... ఎట్సెట్రాలు!'

నేనిలా అంటే "ఎవరు చెప్పారు... ఆత్రేయ చెప్పాడా?" అని నవ్వేదానివి.

"కాదు. నా సొంతం" అంటె—

"సర్లేదు... నీ బుర్రలో అంతా ఇసుకే అనుకున్నాను. కొంత మట్టి కూడా వుందన్న మాట" అనే దానివి. తర్వాత "మట్టి తిందామా? బావుంటుంది!" నీ పిచ్చి ప్రశ్నకు అసహ్యమేసేది.

చిరాకైన నన్ను చూసి "అరే యార్. అంతా ఇసుక బుక్కుతున్నారు బియ్యంలో కలుపుకొని. మరి చిన్నప్పటిలా మనం తింటే ఏం' అనే దానివి. నీతో నెగడం నా తరం కాకపోయేది. నీ మాటల్తో పోటీపడే ఆలోచనా జ్ఞానం అప్పుడెక్కడిది!

మీ నాన్న కోప్పడ్డ రోజు నా కింకా గుర్తు... నువ్వు సెకండియర్ బోటనీలో ఫెయిలయినప్పుడు ట్యూషన్ పెట్టినా ఎందుకు ఫెయిలయ్యావన్నందుకు నీ జవాబుకు ఆయన తెల్లమొహం వేశాడు కదూ!

"ఫెయిలయ్యాను తప్పేముంది? పుట్టపర్తి నారాయణాచార్యులనే ఆయన పద్నాలుగో ఏట రాసుకున్న 'పెనుగొండ లక్ష్మి' కావ్యం పంధొమ్మిదో ఏట పాఠ్య పుస్తకమై ఆయనకే ప్రశ్నాపత్రంగా వచ్చింది. తీరా ఆ మహానుభావుడు అందులోనే ఫెయిలయ్యాడు.

తాను రాసుకున్నదాంట్లో తానే ఫెయిలయిన వాళ్ళుండగా ఎవడో రాసిన పుస్తకాన్ని చదివి రాస్తే నేను ఫెయిలవడంలో విశేషమేముంది నాన్నా..." అని. నేను మాత్రం బాధపడ్డాను.

ఆ ట్యూషన్ టైంలో నువ్వు నన్ను కల్సుకునే దానివి. ఎన్ని కబుర్లు...? పార్కులో నేలాడే కళ్ళన్నీ మనల్ని ఢీకొట్టేవి. మొన్నో రోజు పల్లీలమ్మే ఆ కుర్రాడు సిమెంటు బెంచీ మీద ఒంటరిగా కూర్చున్న నన్ను "ఆమె రాలేదా సార్" అనడిగాడు. చేతిలో పల్లీ బుట్ట.

"సిక్కనిపిస్తే చెప్పరా..." నా జవాబుకు వాడు అయోమయంలో పడ్డాడు. ఇలా రోజూ... అనుమానంగా చూసి అశాంతి స్వప్నంలా కదిలిపోతాడు వాడు. తెగిపోయిన కలలు వాడి చిన్నారి కాళ్ళకు చుట్టుకుంటాయి. తిరిగి చూసే వాడి చూపులో సంజీవి మొక్క...

సూరీడు చిట్లిపోతుంటె... శూన్యం తెగిపడుతుందా పార్కులో... మున్సిపాల్టీవోడు నెత్తి మీద వెలుగుని కుమ్మరించేంత వరకూ నిశీధిలోనే వుండిపోతాను నీ జ్ఞాపకాల్ని పదిలంగా పెకిలించుకుంటూ.

ఆలోచనలు స్పర్శ కోల్పోయాక 'ఆమె' గుర్తొచ్చి నడుస్తాను.

నడిచిరావడం 'పరువు' తక్కువని ఆమె పోరు... ముద్ద గొంతులో పడేటపుడు మహిళా సంఘాల ఏకరువు.

మనో... నువ్వనేదానివి ఆడాళ్ళ నోట్లో ఆవ గింజ నానదు కాని అణుబాంబులు నానుతాయని. నీ కొత్త థియరీని నమ్మేవాణ్ని కాదు. ఆ సూత్రం నిన్న నిజంగా చూశాను.

ఏదీ దాచుకోక ఊరంతటికీ వార్తలందించే పక్కింటావిడ... రెండేళ్ళుగా అక్రమ సంబంధం సాగిస్తున్న మరొకడితో ఇద్దరు పిల్లల్ని విడిచి పారిపోయింది.

ఎవరి కళ్ళలోంచో ఓ కన్నీటి చినుకు...???

అర్ధరాత్రి చుక్కలా రాలిపోయిన కేక...!!!

బిగుసుకుపోయిన గూర్ఖా కర్ర చప్పుడు...!!!

ఎంతకీ నిద్ర పట్టదు... బయట పల్చటి వెన్నెల, ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటుంది... చంద్రుడు స్ఖలించినట్టు... వెన్నెల!!

నీ ఉత్తరం తీసి చదువుతాను... కుక్క ఏడుస్తుంది. అసలు నీ పరిచయం ఉత్తరంతోనే కదూ. ఆ రోజు పోస్టాఫీసులో నేనో కవర్ పోస్ట్ చేయబోతూ కవర్‌కున్న గమ్‌ని నాలుకతో తడిపి అంటిస్తే... ఎంతకీ అది అంటుకోకపోయేసరికి పోస్ట్ మాస్టర్ నుద్దేశించి అన్నాను సీరియస్‌గా

"ఏమండీ... కవర్ వెనకాల గమ్ వుండట్లేదు" అని.

"ఉన్నదంతా నాకిం తర్వాత ఎలా వుంటుందండీ" పక్కనించి పిడుగులా వచ్చిన మాటకు నీ వైపు కోపంగా చూస్తే... నవ్వుతూన్న నీ కళ్ళు... నేనూ నవ్వాను.

అలా... ఎన్ని తీరాలు?

ఆ తర్వాత అందిన నీ ఉత్తరం...

'గుండె గదుల్లో కన్నీళ్ళు మురిగిపోయి
బాధ దుర్భరమైనప్పుడు ఏడ్చినవాడు మనిషి.
కంఠంలో కప్పిపుచ్చుకున్నవాడు మహర్షి!
మీరే బాపతు...?'

చింత చెట్టు కింది గ్రౌండులో మిత్రబృందం మధ్య వున్న నీ దగ్గరికి పరిగెత్తుకొచ్చి 'నేను మనిషినే' అని చెప్పినపుడు ... మిగతావాళ్ళంతా బిక్కమొగ మేసారు కదూ.

నువ్వు మత్తుగా నవ్వావు.

అరచేతిని చుంబించి... 'ఇది నా ఆటోగ్రాఫ్' అంటుంటే... నిజాన్ని నిగ్రహించుకోని నా కన్నుల్లో మేఘాలు దూరుతుంటే... మబ్బుతునకనై తేలి వచ్చాను.

భూమ్మీద ఇంద్రధనస్సు పరుచుకున్నట్టు... ఆ రోజంతా రంగుల వలయాల్లో నేను... అప్పట్నించి రోజూ కల్సుకునేవాళ్ళం.

నాణెం మీద నాలుగో సింహం లాంటి నీ నాన్న వేసిన నిఘా...

నీ అడుగు మీద నిఘా...

నీ శ్వాస మీద నిఘా...

నీ కళ్ళ మీద నిఘా...

నీ గురించి నే నెక్కువగా బెంగపడితే తేలిగ్గా నవ్వుతావు.

'అణువు మీద నిఘా వేస్తే ఆటంబాంబవుతుంది' అనేదానివి.

నీ ఆలోచనే ఈనాడొక విస్ఫోటనం నాలో...

నేను సిన్మా కెళ్దామంటే నువ్వు 'హరికథ'కు తీసికెళ్ళావో రోజు. నిజమే... అక్కడంతా ముసలాళ్ళే. చక్కటి ఏకాంతం. దాన్ని భంగం చేస్తూ కథకుడికి కన్నుకొడితే... కథ మర్చిపోయి కళ్ళు తేలేసినప్పుడు పారిపోయొచ్చాం కదూ...

వారం రోజులు నవ్వుకున్నాం అదే గుర్తు తెచ్చుకుంటూ.

నా సరిహద్దులపై ముళ్ళకంచెలు నాటాక... నా శరీరంపై గాయాలు విలయ నృత్యం చేశాక... మూలుగులు సైతం బయటికి రానీయని భయంతో గదిలో ముడుచుకుపడుకున్నప్పుడు నిద్రను విదిలేసిన కనురెప్పలు... ఆకల్ని ఆవిష్కరించిన పేగులు నిన్ను పిలుస్తాయి. నువ్వు రావు. ఇంకెప్పుడూ రావేమో...???

గది నిశ్శబ్దాన్ని చిత్రిస్తుంది. ప్రేమ రంగు నలుపు!!!

నీ జ్ఞాపకం గాయమై సలుపుతుంది.

జీరబోయిన 'మనో' గీతం గుండెలోంచి జాలువారుతుంది. పల్లవి లేని గీతానికి అంతం లేదనిపిస్తోంది. సెలవ్...మనో!

●●●●●●●●●●●●●●

అంకితం

ఈ కథ మహేందరన్నయ్యకు

ప్రేమతో ... అంకితం

●●●●●●●●●●●●●●

## అర్చన

కొదమ కండలు కరగించుకొనిన ఫలము
పంట నవలుగా యెద్దుల బండి నిండి
తనదు గేహంబు జేర ముదంబుతోడ
కాంచి, కర్షకుడొక భావ కవిగ మారె!

చలికి వెట్టను గూర్చు సరసోక్తులందున
భోగిమంటల నేత్రములు జ్వలింప
రమణీమణీ కళారాధన ఫలియించి
ముంగిట గొబ్బెమ్మ మురిసిపోవ,
అందాల బావ తీయని కోరమాపుతో
నెలత నెమ్మదిని వెన్నెలలు విరియ,
అయ్యవారికి దండమని మ్రొక్కు బసవన్న
నటనంబు ముద్దు ముచ్చటలు నింప,
అంబుజోదర దివ్యగానామృతంబు
పాత్రలను నింపి హరిదాసు పంచిపెట్ట
ధనమయంబయ్యె నాంధ్ర సామ్రాజ్య మెల్ల
రమ్మ! పాలింపు మింక సంక్రాంతి లక్ష్మి!

—ఎం.పి. జానుకవి

## బ్రదుకు భాష్యం

మేలుకొలుపులు పాడుతుంటిని
మేలుకోరే పలుకుతుంటిని
మేలుకోవోయ్! మేలుకోవోయ్!
నవ్య జీవన దివ్యకాంతుల
భావి పథమున ప్రగతి సాధన
నంతు కృషిలో ముందు నిలువగ!—
పడగ నీడల బ్రదుకు భయముల
పారద్రోలెడి పరమశక్తిగ
మేలుకోవోయ్! మేలుకోవోయ్!

నిద్ర కాదిది నిద్ర కాదిది
అలసొలసిన నిద్ర కాదిది!
స్వార్థపూరిత ధూర్త నేతల
ఎత్తుగడలతొ మత్తు నిద్రిది!—
వేళ కాదిది వేళ కాదిది
కునుకు తీయగ వేళ కాదిది!
ఆగడాలను ప్రోగుజేసీ
కాగడాలను చేతపట్టీ
కుళ్ళు బుద్ధులు కొంపముట్టా
కొలువు తీరిన తరుణమందున!—
వేళకానీ వేళ నిద్రలు
దరిద్ర దేవత పాద ముద్రలు!!—

తల్లి భారతి కంటి నీటికి
కాల్వ త్రవ్వు కసాయిలుండగ
అన్నదమ్ముల రుధిర ధారల
నేల తడిపెడి నీచులుండగ
జాతి కీర్తిని మంటగలిపే
నివురుగప్పిన నిప్పులుండగ
నిదురలోనే సమాధికి
నిన్ను చేర్చెడి నిపుణులుండగ
వేళకానీ వేళ నిద్రలు
నెతల బ్రదుకుల సాక్షి ముద్రలు!—

పుట్టినప్పుడె కులము పేరున
పురుడు పోసిరి పుణ్యభూమిని!
కులము తెలిసీ పలక బలపము
చేతికిచ్చిరి మాతృ భూమిని
ఏది. కులమని ఎరిగినపుడే
ఎదగనిచ్చిరి భారతావని!
కులము కులమను సంకుచితులే
కులరహిత సమాజమంటూ
కుటిల నీతుల గోతులందున
కూల్ర్తోసెడి సమయమందున
కూడు ముఖ్యమొ? కులం ముఖ్యమొ?
గుణ వివక్షణ చేయ పిలిచితి!—

అడుగు కొక్కటి గుడిని కట్టీ
గుడిని గుడినొక శిలను నిలిపీ
శిలువ కోసమె వర్చి గట్టీ
సమాధి కొక్క మసీదు గట్టీ
నీ గూడు సంగతి గుడుల్లోని
దేవుడికి నైవేద్యమిచ్చిరి!
కూడు గూడని పోరినాకా?
గుడికి దారులు చూపుతారు
దారి చూపిన ధర్మ ప్రభులకు
ఓటు వదలక వేసుకొనుమోయ్!
గురక నిద్రల గూడు దొరకదు
గూళ్ళు ముఖ్యమొ? గుడులు ముఖ్యమొ?
తరచి చూడగ తట్టిలేపితి!

ఎందరెందరు మేలుకొలుపులు
పాడినారో వీడినారో?
ఎందరెందరు నిజము తెలుపగ
నిష్ఠురోక్తులు వాడినారో?
ఎందరెందరు మాట ఈటెల
నెత్తి గుండెల గ్రుచ్చినారో?
ఎందరెందరు జ్ఞాన జ్యోతులు
వెల్గింప నెతలు చెందినారో?
చెవిటి వానికి శంఖమూదిన
చందమాయెను గతము తండ్రీ!
ఈ జడత్వమె కొంప కూల్చును.

సుప్రభాతం కాదు కాదిది
బాజా దులిపెడి బ్రదుకు భాష్యం!

—పులికంటి కృష్ణారెడ్డి